# దారిలో దొరికిన ప్రేమలేఖలు



– ???

*ఎవరు వ్రాశారో తెలియదు, ఎవరికి వ్రాశారో తెలియదు. దొరికిన ప్రేమలేఖల సంపుటినుంచి నెలకో ప్రేమలేఖ !!*

## – 7 –

**అర్థంకాని ఆనందమా,**

నిన్ను ఏ విధంగా సంబోధించను? నిన్ను తలుచుకుంటేనే ఓ ఆనందం. ఆ ఆనందం ఎందుకా అని చాలాసార్లు ఆలోచిస్తాను. కానీ ఎందుకో నాకు అర్థంకాదు. అవును.! అసలు ఒకర్ని తల్చుకుంటే ఆనందమూ, వేరెవర్నో తలుచుకుంటే విషాదము ఎందుకొస్తాయి? అసలు ఎన్నిసార్లు చూసినా నిన్నుమాత్రం సంపూర్ణంగా చూడలేక పోతున్నాను. నీ సంపూర్ణత్వాన్ని చూడాలనే తహ తహ మరింత ఎక్కువ అవుతోంది. నీ రూపాన్ని కంటినిండుగా మనసు నిండుగా చూసుకోవాలని నీ రూపాన్ని మనస్సులో చూస్తాను. కేవలం మొదటగా నీ చిరుముంగురులు ప్రత్యక్షమౌతాయి. ఎంత చక్కని తిన్ననైన పాపిటనీది. ఆ వంకెల జుత్తు ముఖం మీద వాలే సున్నితమైన, పట్టువంటి ముంగురులు.



అందమైన నీ నుదురూ.. దాని క్రిందుగా వంపు తిరిగిన చక్కని కనుబొమలు ఆ క్రింద? అందాల రాశీ, అక్కడే నా మనస్సు లయ తప్పిపోయింది. నీ చిక్కని తేనెరంగు కళ్ళల్లో ఎంత అత్యద్భుతమైన భావాలు ప్రతిఫలిస్తాయో ఎలా చెప్పను? నీ మనస్సులోని నిర్మలతా, పవిత్రతా, అంతెందుకూ, కదిలే ప్రతిభావమూ ఓ అత్యద్భుత సజీవ శిల్పంలాగా, చైతన్యవంతంగా చలిస్తూపోయాయంటే నమ్ము! నీ కనుపాపలు ఎంత సౌందర్యవంతాలు.. ఎంత సంపూర్ణాలు.. వానిని ఎలా వర్ణించను? నాకు భాషలేదు ప్రాణమా! ఉంటే, వాటిని అక్షరాల్లో నింపలేని నిస్సహాయత నన్నెందుకు ఆవరిస్తుంది?

నీ సౌందర్యాన్ని మనస్సులో నింపుకున్నాననుకున్న నాలోనూ ఇంకా అనేకానేక విషయాలు తమంతటత తామె చోటు చేసుకుంటున్నాయి. ఇవ్వాళ ఒక చిత్రమైన విషయాన్ని చూశాను ప్రాణసఖీ. నీతో చెపితే నీ కళ్ళు చెమర్చి వర్షిస్తాయని భయంగానూ ఉంది. చెప్పకపోతే నా అంతరాత్మ నన్ను నిలదీస్తుంది మరి! ఏం చేయనూ?

పేదరికం భయంకరమైనది కదూ! కేవలం కంటి చూపుతో లోకాన్ని శాశించే మహారాణివి నీవు. యీ విషయాలు నీకు అయిష్టాన్ని కలిగిస్తాయని మనస్సులో భయంగా ఉన్నా, దయవెదజల్లే దేవకన్యా, నీలోని దయ పొంగి ప్రవహిస్తుందన్న నమ్మకమూ ఉంది.

ఎంత వెంపరలాడుతుందీ లోకం? ఏదో ఓ చిన్న తోడు. ఏదో ఓ చిన్న రక్షణ. ఏదో ఓ చిన్న సంతోషము సంతృప్తీ.. వీటిని వెదుక్కోవటం, ఆ సంతృప్తీ సంతోషమూ దొరక్క దీనమైన దృక్కులతో లోకాన్ని ఆబగా అడుక్కోవడం ఎంత దీనమైన వెంపర్లాట. ఓ పసిపిల్ల వాడు చిరుగుల చొక్కాతో, చిరిగిపోయి జారిపోతున్న వెలిసిపోయిన లాగూతో, నూనె చుక్క నోచుకోని చింపిరితలతో, దరిద్రాన్ని గుర్తించని తళతల కన్నులతో ఉత్సాహంగా హాయిగా నవ్వుతున్నాడు. నా దేవతా! నా కళ్ళు చెమర్చాయి. అశ్రువులు నిండి లోకం మసకబారిపోయింది. ఆ బిడ్డ దరిద్రం ఆ బిడ్డకి తెలీనే తెలీదు. కానీ చూడు. ఆ కళ్ళల్లోని తళతళ చూడు. ఓ ఉత్సాహపు కెరటంలా ఆ



పరుగు చూడు. పాదరక్షలు వేసి ఆ పసిపాదాల్లో ఏ రాయి గుచ్చుకుంటుందో, ఏ మదాంధుని చూపులా ఏ ముల్లు గుచ్చుకుంటుందో అని మనసు ఎంత తల్లడిల్లుతోందో తెలుసా! నా ఆత్మా, ఏమని చెప్పను? ధనవంతులు ఏ స్టీలు గ్లాసు కోసమో చిరిగిన బట్టలు వేస్తారు. ఆ వ్యాపారులు అవి రిపేరు చేసి ఏ సెకండు హేండు షాపువాడికో విక్రయిస్తారు. ఆ సెకండు హేండు షాపు వాడు వాటిని ఇదిగో, యిలాంటి బీదలకి లాభానికి అమ్ముతాడు. చిన్నారీ, ఓ తల్లి, ఓ దీనాతి దీనమైన బీదతల్లి, చిరిగిన చీరకొంగు ముడి విప్పి, చిల్లరనాణాలు లెక్కపెట్టి, సరిగ్గా లెక్కపెట్టలేదేమో, ఉన్నదానికంటే ఇంకో ఐదుపైసలు ఎక్కువుందేమో అని మరీ మరీ లెక్కపెట్టి, ఆ దుకాణదారుడు అడిగిన ధరకంటే, తన దగ్గర ఉన్న చిల్లర తక్కువ అని తెలిసి, తన బీదరికపు గోడు ఆ నిర్దయుని ముందు పదే పదే వెళ్ళబోసుకుని, బ్రతిమలాడుతూ నిలబడుతుంది. వాడు ఎకసెక్కాలు చేస్తాడు. హేళన చేస్తాడు. 'ఛీ..ఫో' అని యీసడించి రెక్కపట్టుకుని నెట్టేస్తాడు. "అయ్యా, నీ కాళ్ళకు మొక్కుతాను. నా బిడ్డకి పుట్టినరోజు నీ బిడ్డలు చల్లగా ఉంటారు. దయదల్చ"మని ప్రార్థిస్తుంది. "నువ్విచ్చే చిల్లరకి ఇంతకు మించిరాదు..." అని ఓ మాసికల గౌను విసురుతాడా వ్యాపారి. ఆ పసిబిడ్డ? రంగురంగుల సెకండు హేండు గౌనే కావాలని పట్టుపడుతుంది.. ఏడుస్తుంది. తల్లి దగ్గర డబ్బులేదు. పాపం ఏం చేస్తుంది? బిడ్డని కొడుతుంది. తన్నులు తింటున్నా ఆ బిడ్డ ఆ రంగుల గౌనే కావాలని ఏడుస్తుంది. మరి ఆ చిన్ని బిడ్డకు యీ లోకపురీతులు తెలియవుగా! నిస్సహాయంగా ఆ బీదతల్లి వ్యాపారి కాళ్ళకు మొక్కుతుంది. తన స్వాభిమానాన్ని చంపుకుని పదిమందిలోనూ మాటలు పడుతూ అర్థిస్తుంది. ఉన్న మొత్తం చిల్లరా ఆ నిర్దయుని చేతిలో పోస్తుంది. వాడు విసుగెత్తి ఆ గౌను ఆ తల్లి ముఖాన కొడతాడు. ఆ తల్లి ఓ సుదీర్ఘమైన నిట్టూర్పు విడిచి ఆ గౌన్ని బిడ్డ చిరుచేతులకి అందిస్తుంది. నా దేవతా, నా ప్రాణమా, అపుడా బిడ్డ కళ్ళల్లో మెరిసే సంతృప్తి మెరుపులు ఎంత అద్భుతం. తన పట్టు సాధించాననీ, తనకిష్టమైన గౌను తెచ్చుకున్నాననీ ఆ బిడ్డ కళ్ళల్లో ఎంత గర్వం. ఎంత అద్భుత ఆనందం.

ఆ గౌను మళ్ళీ ఎవరైనా లాగేసుకుంటారేమో అనే అమాయకపు భయంతో గుండెలకు హత్తుకుంటుంది. 'యీ గౌను నాది.. యీ రంగురంగుల గౌను నాది' అన్న చిరుగర్వంతో ఆ పిచ్చిపిల్ల ఆ గౌనుని అతి భద్రంగా పట్టుకుని సర్వప్రపంచాన్ని జయించిన చక్రవర్తినిలా గర్వంగా మెరిసే కళ్ళతో, చిట్టిచిట్టి అడుగులు లేస్తూ తల్లి వెనక నడుస్తుంది. ఎంత అద్భుతం.!

కానీ ఆ తల్లి? ఉన్న డబ్బులన్నీ గౌనుకి పోగా, ఇంట్లో మిగిలిన పిల్లలకి ఏమి పెట్టాలీ అన్న దీనమైన ఆలోచనలతో విడిచే నిట్టూర్పు ఎంత విదారకమైనది. భగవంతుడు ఎంత పాషండుడు? నా దేవతా, నాకు తెలుసు. నీవీ పేదరికాన్ని ఎరుగవు. చక్కని తోటలో, తోటమాలి సంరక్షణలో, ఆప్యాయతానురాగాల జల్లులతో పెరిగిన గులాబీవి నీవు. కానీ యీలోకపు దైన్యత చూడు.! ఆ పసిబిడ్డ అమాయికత్వాన్ని చూడు ఎవరో తొడిగి విసిరివేసిన ఎవరివో పనికిరాని దుస్తులనే, సరికొత్త దుస్తులను కొని, మారాం చేసి, ఆ మారాం నెగ్గించుకుని, మహారాణిలా తెలిసీ తెలియని పసితనపు గర్వంతో మెరిసే కన్నుల వెలుగు ధారలో తడిసిపోయాను. ప్రాణమా! కళ్ళు ఏడుస్తాయి. నాగుండె చెమరుస్తుంది. ఎంత దైన్యం. ఎంత దుర్భరం పేదరికం.

ఇటువంటి సంఘటనలు వ్రాసి నీ మనస్సుకి కష్టం కలిగించి, జాలిపుట్టించి, తద్వారా నీ మనస్సులో నా స్థానం పదిలం చేసుకోవాలనే దురాశకాదు సుమా! ఆత్మీయుల ఎదుట అన్నీ చెప్పుకోవటం మానవ సహజమైన ప్రకృతి. మరి నీవు ఆత్మీయురాలివేకాదు.. దయనిండిన దేవతవు, ఇది మనోగత దుఃఖం కాదు.. ఆత్మానుగత విన్నపం. దయనిండిన నీ సున్నితపాదాల ముందు వేచివుండే దైన్య కుసుమం. ఆగ్రహించవు కదూ! యీ లోకపు నిర్దాక్షిణ్యతా, యీ లోకపు లౌక్యమర్మతా తెలియని స్వచ్ఛహృదయం నీది. సుడిగాలుల మధ్య ఇరుక్కుని పేదరికపు ఉక్కుపాదాల కింద నలిగే గుండె నాది. ఏం చేయను మరి. నీ కళ్ళు చెమరుస్తాయి.. దయతో అనురాగాన్నో జాలినో వర్షిస్తాయి. ఆత్మా, అనురాగాన్ని వర్షించు. జాలిని కాదు సుమా!

ఇక ఉండనా మరి

నీ

-X-

*(వచ్చేనెల మరో ప్రేమలేఖ)*

Post your comments